త్రిపురారంలో దొంగల హల్‌చల్

- ట్రాక్టర్ల బ్యాటరీలు, ఆలయాలు, తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- ఉదయం రెక్కీ.. రాత్రి దొంగతనాలు
- పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని వేడుకోలు



త్రిపురారం : మండల కేంద్రంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వారం రోజులుగా త్రిపురారం మండల కేంద్రంలో ఇళ్ల ముందు పెట్టిన ట్రాక్టర్ల బ్యాటరీ చోరీలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పగటి పూట కూడా తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు చెలరేగిపోతున్నారు. పగటి పూట రెక్కి వేసి రాత్రి పూట దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న శివాలయంలో మిట్ట మధ్యాహ్నం గుర్తు తెలియని యువకుడు నంబర్ ప్లేట్ లేని మోటార్ సైకిల్‌పై వచ్చి ఆలయంలోని పలు తాళాలు పగలగొట్టి గురువారం చోరికి ప్రయత్నించాడు. ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. గత నెలలో మండలంలోని పెద్దదేవుల పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నర్లకంటీ గూడెంలోని శ్రీ కొదండరామ చంద్రస్వామి ఆలయంలో హుండీ పగలగొట్టి డబ్బులు, విగ్రహాలపై ఉన్న బంగారాన్ని దొంగలించారు. పలు గ్రామాల్లో వ్యవసాయ మోటార్లకు ఏర్పాటు చేసిన స్టాటర్లు, సర్వీస్ వైర్లు, మోటార్లు కూడా దొంగతనం జరిగిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. హోటళ్ల ముందు పెట్టిన ద్విచక్ర వాహనాలు సైతం దొంగిలించబడ్డాయి. బొర్రాయి పాలెం, రాజేంద్ర నగర్, సత్యనారాయణపురం, రాగడప, నీలాయి గూడెం గ్రామాల్లోను వీధులు, వ్యవసాయ పొలాల అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి ఆయిల్, కాపర్ వైర్‌లు కూడా చోరీకి గురవుతున్నాయి. పలు ప్రాంతాల్లో గొర్రెలు, మేకలు సైతం దొగతనాలకు గురైన సంఘటనలు ఉన్నా ఫిర్యాదు చేయడానికి రైతులు ముందుకు రానట్లు తెలుస్తుంది.

కానరాని సీసీ కెమెరాలు

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం. కాని త్రిపురారం మండల కేంద్రంలో తొక్క సీసీ కెమెరా కూడా లేకపోవడం వల్ల దొంగలను గుర్తించడం కష్టంగా మారుతుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సీసీ కెమెరాలు ఉండేవి. కాని రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొన్ని సీసీలు ధ్వంసం కాగా నిర్వహణ సరిగాలేకపోవడం వల్ల మరి కొన్ని సీసీలు పని చేయడంలేదు. వ్యాపారస్తులు, ముఖ్య ప్రజా ప్రతినిధుల, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాని ప్రజలు కోరుతున్నారు.

నిర్లక్ష్యంగా పెట్రోలింగ్

మండలంలో 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అధికంగా గిరిజన తండలు ఉన్నాయి. ప్రతి రోజు ఏదో ఒక్క చోట దొంగతనాలు జరుగుతున్న సంఘనలు చోటుచేసుకుటున్నాయి. అయితే గతంలో పోలీసులు రాత్రి వేళలో పెట్రోలింగ్ నిర్వహించే వారు. కొన్ని నెలలుగా పోలీసులు గ్రామాలు వెళ్లడంలేదని పలు గ్రామాల్లోని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ప్రతి రోజూ పెట్రోలింగ్ నిర్వహిస్తే దొంగతనాలు తగ్గముఖం పట్టే అవకాశం ఉంటుందని, గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు. కేసులు వచ్చినప్పుడే పోలీసులు గ్రామాలకు వెళ్లకుండా అప్పుడప్పుడు గ్రామాలకు వెళ్లి ప్రజతో మమేకం కావడం అవసరమని ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు పోతున్నాయి



“ గ్రామంలో ఇళ్ల ముందు పెట్టిన ట్రాక్టర్ బ్యాటరీలు దుండగులు ఎత్తుకపోతున్నారు. బండ్లు ఇళ్ల ముందు పెట్టాలంటే భయమేస్తుంది. ఇప్పటికి 7ట్రాక్టర్ బ్యాటరీలు పొయినట్లు తెలిసింది. ఒక్క బ్యాటరీ రూ. 8 వేలు ఉండడంతో రైతులు నష్టపోతున్నారు. తెలిసిన వ్యక్తి హోటల్ ముందు పెట్టిన బైక్ కూడా పొయింది.

\- అనుముల సుధాకర్ రెడ్డి, త్రిపురారం

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



“ మండల కేంద్రంలో ఒక్క సీసీ కెమెరా కూడా లేకుండా అయ్యింది. సీసీ కెమెరాలు ఉంటే దొంగలు భయపడతారు. ప్రతి గ్రామంలో సీసీలు ఏర్పాటు చేసుకునే విధంగా పోలీసులు చర్యలు తీసుకుంటే బాగుంటుంది. గురువారం శివాలయంలో దొంగలు పడడం సీసీలో రికార్డు అయ్యింది.

\- చింతకాయల యాదయ్య, త్రిపురారం

నాణ్యమైన బోధనతో ఉత్తమ ఫలితాలు

- సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే

హాలియా : విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన చేసినప్పుడే ఉత్తమ ఫలితాలు రాబట్టగలుగుతామని ఉపాధ్యాయులకు సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి సూచించారు. సోమవారం హాలియా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో నెలకొన్న పలు సమస్యలను లెక్చరర్లను అడిగి తెలుసుకున్నారు. జూనియర్ కళాశాల్లో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించి తక్షణమే త్రిఫేజ్ విద్యుత్‌ను ఏర్పాటు చేసేందుకు విద్యుత్ డీఈతో మాట్లాడారు. విద్యార్థుల సౌకర్యం కోసం ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో 150 డ్యూయల్ బెంచీలను తక్షణమే ఏర్పాటు చేయిస్తామని, కళాశాల ప్రహరీ నిర్మాణానికి రూ. 4.50లక్షల నిధులను మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే విద్యార్థుల చదువుతీరును ఆరా తీశారు. డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, నాయకులు పిల్లి ఆంజనేయులు, డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ గన్ శ్యామ్, జూనియర్ కళాశాల ఇంచార్జ్ ప్రిన్స్‌పాల్ శిల్ప, కస్తూరిబా గాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ హైమావతి తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమ పోరాట కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

నాగార్జున సాగర్ : కృష్ణాతీరంలోని నందికొండ శివారు రైతులు సోమవారం త మ సమస్యల పరిష్కారం కోసం ఒకే వేదిక మీదకు వచ్చి రైతు సంక్షేమ పోరాట కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. ఆ కమిటీ చైర్మన్‌గా కట్టెబోయిన కిరణ్‌కుమార్, వైస్ చైర్మన్‌గా ఆవుల సత్యవతి నాగిరెడ్డి, జటావత్ మంగమ్మలు ఎన్నిక కాగా, ఫైలాన్ కమిటీ చైర్మన్‌గా చిన్నిపోగుల రమేశ్, వైస్‌చైర్మన్‌గా సింగం రాజేశ్వరి, మాసమ్మల వాణిలు ఎన్నికయ్యారు. వీరికి సలహాదారులుగా పత్తిరాంబాబు, ఆవులదొడ్డి మధు, లోకసాని మల్లారెడ్డి, సీహెచ్.వెంకటయ్య, గుడిపల్లి గురువయ్య, సిరికొండ మధు, శీలం వెంకటయ్య, సర్వారెడ్డి, మట్టయ్య, మంగ్లనాయక్‌లు వ్యవహరించనున్నారు. ఈసందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ సాగర్‌డ్యాం నిర్మాణ సమయంలో ముంపుకు గురైన రైతులు డ్యాం నిర్మాణం పూర్తయిన తర్వాత నందికొండ కాలనీలైన హిల్‌కాలనీ,పైలాన్‌కాలనీల సమీపంలో గుట్టలు, రాళ్లను తొలగించి 70 సర్వేనెంబర్‌లోని భూమిని వ్యవసాయయోగ్యంగా మార్చుకొని సుమారు 68ఏళ్ల నుంచి భూమిని సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఆ భూములపై నేటికీ ఏ ప్రభుత్వం కూడా హక్కులు కల్పించలేదని తెలిపారు. 250మంది రైతులు సుమారుగా 300ఎకరాల భూమిని సేద్యం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆ భూములకు 1970నుండి 1993వరకు శిస్తూ కూడా చెల్లించారు. పట్టాదాసుపాసుబుక్కులు లేనందున ఇందులో పండించిన పంటను మార్కెట్‌కు తీసుకపోవడానికి ఇబ్బందులు ఎదరుతున్నాయని వారు వాపోయారు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి ఈ భూములను సర్వే చేయించి, పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతు పక్షపాతి.. కాంగ్రెస్ ప్రభుత్వం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

డిండి : రైతుల పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు, మండలంలోని చెర్కుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా రైతు ఆరుగాలం కష్టించి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటే రూ. 2360 మద్దతు ధర లభిస్తుందని, అదేవిధంగా సన్నరకం వడ్లకు క్వింటాల్‌కు మద్దతు ధరతోపాటు అదనంగా రూ. 500 బోనస్‌గా ప్రభుత్వం అందిస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టడం, ఎలాంటి అవకతవలకు పాల్పడిన అధికారులపై చర్యలు తప్పవన్నారు. వచ్చే పెండింగ్‌లోనున్న రైతులకు వారం రోజుల లోపు రూ. 2లక్షల వరకు రుణమాఫీ పూర్తవుతుందన్నారు. వచ్చే ఏడాది జనవరి నెలలో రేషన్‌కార్డు లబ్దిదారులందరికీ రేషన్ షాపుల్లో సన్న బియ్యం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. మండలంలోని 31మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణ లక్ష్మీ చెక్కులను అందజేసిన అనంతరం నూతన పీఏసీఎస్ గోదామును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీబీ చెర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చెర్మన్ జమున మాధవరెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్, సిరాజ్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, సాయి కుమార్, లక్ష్మణ్, భీముడు నాయక్, మేకల కాశన్న, నూకం వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, రాములు, దామోదర్‌రెడ్డి, సలయ్య, బుచ్చిరెడ్డి, మైనోద్దీన్, ఖలీం, పీఏసీఎస్ చెర్మన్‌లు, డైరెక్టర్లు, సీఈఓ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

మిర్యాలగూడ అర్బన్ : పుస్తక పఠనం విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపు లైబ్రరీ వద్ద నవచేతన బుక్కు సమితి మొబైల్ వాహనాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పుస్తకాలు విజ్ఞాన బాండాగారాలుగా ఉంటాయన్నారు.నిత్యం పుస్తక పఠనం ద్వార ఎన్నో విషయాలు తెలుస్తాయన్నారు. నవచేతన బుక్ వాహనంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని పుస్తక ప్రేమికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, సీపీఐ మండల కార్యదర్శి ఎండి.సయ్యద్, నాయకులు లింగానాయక్, వల్లంపట్ల వెంకన్న, పోలేపల్లి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

త్రిపురారం : నిడమనూరు మండల పరిధిలో కారు, బైక్ ఢీ కొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన నిడమనూరు మండలంలోని మైనార్టీ గురుకుల పాఠశాలకు సమీపంలో సాయి బాబ విగ్రహం వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలంలోని కంపాలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మునగబావి గూడెం గ్రామానికి చెందిన గుండెబోయిన మొగిలయ్య, నాశనబోయిన బోర్రయ్యలు కూలి పనులకు వెళ్లి హాలియా నుంచి త్రిపురారం వైపు తిరుగు ప్రయాణంలో బైక్‌పై వస్తున్నారు. నిడమనూరు మండలంలోని మైనార్టీ గురుకుల పాఠశాలకు సమీపంలో సాయిబాబా విగ్రహం వద్దకు రాగానే మిర్యాలగూడ వైపు నుంచి హాలియా వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే గమనించిన బాటసారులు 108 వాహనానికి సమాచారం అందించారు. గాయాలైన ఇద్దరు వ్యక్తులను చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న నిడమనూరు ఎస్‌ఐ గోపాల్ రావు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గాయపడిన ఇద్దరి వ్యక్తుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



హాలియా : ఇన్‌చార్జ్ డీటీకి వినతి పత్రం అందజేస్తున్న టీపీయూఎస్ సంఘం నేతలు

హాలియా : ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ ధర్మగ్రహ దీక్ష షెడ్యూల్ నిర్ణయంలో బాగంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు, మెడికల్ బిల్లులు. పీఆర్సీలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ టీపీయూస్ అనుముల మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల తహసిల్దార్ కార్యాలయంలో ఇంచార్జ్ డీటీ రఘుకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ అనుముల మండల ప్రధాన కార్యదర్శి గుర్రం సత్యనారాయణ రెడ్డి, పెద్దవూర మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, కర్ణాకర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వినతి

కొండమల్లేపల్లి : పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ, మెడికల్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ టీపీయూఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షలో భాగంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సైదులు, ప్రధాన కార్యదర్శి అంజయ్య, శ్రీకాంత్‌రెడ్డి, పరమేష్ పాల్గొన్నారు.

ఒక్క డీఏ ప్రకటించడం అన్యాయం

గుర్రంపోడు : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం గుర్రంపోడులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో టీచర్లు నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరామ్, మండల శాఖ అధ్యక్షుడు సైదయ్య, ప్రధాన కార్యదర్శి వేణుమాదవ్, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆక్రమణలను అడ్డుకోవాలని సబ్ కలెక్టర్‌కు వినతి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మిర్యాలగూడ : గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకోని కబ్జాకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అల్వాల్‌పాడు గ్రామ మాజీ సర్పంచ్ చెవుల రామయ్య, గ్రామస్తులు గుడిపాటి మల్లయ్య, చిన్న మట్టయ్యలు కోరారు. సోమవారం ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా గ్రామస్తులు సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌ను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. త్రిపురారం మండలం అల్వాల్‌పాడు గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెం.271లో గల సుమారు 20గుంటల గ్రామ కంఠం భూమిని 40ఏళ్లగా శ్మశాన వాటికకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఆ భూమి పరిధిలో ప్రైమరీ స్కూల్, గంగాభవాని దేవాలయం ఉన్నందున గతంలో ఆర్డీఓ, తహసీల్దార్‌ల అనుమతితో గ్రామ శివారు తుంగపాడు వాగును ఆనుకోని ఉన్న స్థలంలోకి శ్మశాన వాటికను తరలించి గ్రామకంఠం పాత శ్మశాన వాటిక స్థలంలో విద్యార్థులకు, యువకులకు ఉపయోగపడే విధంగా క్రీడా మైదానం ఏర్పాటు చేసి ట్రాక్టర్లతో మట్టిపోసి చదును చేసినట్లు తెలిపారు.అదే సర్వే నెంబర్‌లో 1-10 గుంటల వ్యవసాయ భూమి కలిగిన రైతు పోర్జరీతో 1-30 గుంటలుగా మార్చుకోని అదనంగా మరో 15గుంటలను కలుపుకోని కబ్జా చేయడానికి యత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇటీవల క్రీడా మైదానాన్ని ట్రాక్టర్‌తో దున్నడానికి ప్రయత్నిస్తే గ్రామస్తులు అడ్డుకున్నట్లు పేర్కొన్నారు. సర్వేయర్‌ను కూడా అడ్డుకోని కబ్జాకు యత్నిస్తున్న సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోని గ్రామకంఠం భూమిని కాపాడాలని కోరగా సబ్ కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రావుల కోటయ్య, చంద్రయ్య, పెద్ద వెంకన్న, రమావత్ సైదా, ఇస్లావత్ హాతీరాం, రావుల సైదమ్మ, బొల్లిగొర్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా సుదర్శన్



దేవరకొండ : దేవరకొండ నూతన మున్సిపల్ కమిషనర్‌గా సుదర్శన్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన భాస్కర్‌రెడ్డి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా నాగారానికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఆ జిల్లా ఫీర్జాదిగూడ కమిషనర్‌గా పని చేస్తున్న సుదర్శన్ బదిలీపై దేవరకొండకు వచ్చారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని బండావత్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని గేరితండాలో నూతనంగా నిర్మించనున్న శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణానికి సోనిమాశక్స సొసైటీ రూ.లక్ష లను విరాళంగా అందజేశారు.గ్రామస్తులు ఆలయాన్ని నిర్మించేందుకు తగిన సాయం అందించాలని సొసైటీ సభ్యులను కోరడంతో సోమవారం సొసైటీ అధ్యక్షుడు ఆడావత్ జైత్రాంనాయక్ రూ.1లక్ష చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌నాయక్, శ్రీధర్‌గౌడ్, బద్యానాయక్, గోవింద్‌నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భూలోకరావు



మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన రామినేని భూలోకరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బాచుపల్లిలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో తన నియామకానికి అన్ని విధాలుగా సహకరించిన అంతర్జాతీయ కబడ్డీ సంఘం టెక్నికల్ బోర్డ్ డైరెక్టర్, తెలంగాణ ఒలింపిక్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, కబడ్డీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ముత్యాలమ్మ విగ్రహానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు, బీజేపీ నేతలు

మిర్యాలగూడ టౌన్ : ఇటీవల హైదరాబాద్‌లో ముత్యాలమ్మ గుడిలో జరిగిన ఘటనను ఖండిస్తూ హిందూ సంఘాల పిలుపు మేరకు సోమవారం పట్టణంలోని కలాల్‌వాడలో ముత్యాలమ్మ, పోతురాజుల విగ్రహాలకు ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు మండల బొట్టు సోములు ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు రేపాల పురుషోత్తంరెడ్డి, సీనియర్ నేత బంటు సైదులు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనం మధన్‌మోహన్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, ముత్యాలమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు కోల సైదులు, లక్ష్మీనారాయణ, వెంకన్న, వెంకన్న, శ్రీను, రవి, ఈదయ్య, బీజేపీ నాయకులు వేణు, గిరి, రాజిరెడ్డి, శ్యాం, సైదులు, శివ తదితరులు ఉన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక ప్రారంభం

మిర్యాలగూడ : ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్ 14, 17 బాలబాలికల బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌ను సోమవారం స్థానిక క్లియో స్పోర్ట్స్ అకాడమిలో ఎంఈఓ బాలునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ దగ్గుపాటి విమల, పీఈటీలు, పీడీలు కన్నెబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, వెంకటరత్నం, నారాయణ, కవిత, ఇందిరా, సావిత్రి, క్లియో స్పోర్ట్స్ కోచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

దేవరకొండ : కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని వీహెచ్‌పీఎస్ సీనియర్ నాయకులు గుద్దేటి సైదులు, శ్రీరామదాసు, వెంకటాచారి డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో వారు మాట్లాడారు.ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా పెన్షన్లు పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ విస్మరించిందన్నారు. నవంబర్ 1వ తేదీ నుండి 16వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. ఈ సమావేశంలో పచ్చిపాల కృష్ణయ్య, మెఘావత్ భాస్కర్, బద్యా, పార్వతి, వెంకట్‌రెడ్డి, కిషన్‌లాల్, రవీందర్, తదితరులున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

నాగార్జునసాగర్ : స్థానిక బీసీ గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు (ఆర్‌బీఎస్‌కె)రాష్ట్రీయ బాల స్వస్థీయ కార్యక్రమంలో భాగంగా సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ ఆర్‌బీఎస్‌కే ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తున్నట్లు తెలిపారు. బీసీ స్కూల్‌లో 900మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి 60మందికి కంటి అద్దాలు అవసరమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపాల్ రాజశేఖర్, దళిత ప్రతీప్, ఏటీపీ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వాత్సల్య మిషన్‌తో మెరుగైన సేవలు

మిర్యాలగూడ టౌన్ : వాత్సల్య మిషన్ ద్వారా ఐసీడీఎస్ మెరుగైన సేవలను అందిస్తుందని మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ రేఖల మమత తెలిపారు. సోమవారం స్థానిక చాంబర్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో 14 అంగన్‌వాడీ టీచరు పోస్టులు, 49 హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్బన్‌లో 100 కేంద్రాలకు గాను 9 ఖాళీలున్నాయని, రూరల్ పరిధిలో 111అంగన్‌వాడీ టీచర్లకు గాను 40పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అదే విధంగా ఈ ప్రాజెక్టు పరిధిలో 6 నెలల నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 6770 మంది ఉండగా 1779 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారన్నారు. చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని అన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న జర్నలిస్టులు

మిర్యాలగూడ : మండలంలోని అవంతీపురం గ్రామానికి చెందిన ప్రెస్ ఫొటోగ్రాఫర్ నాగయ్య ఇటీవల మృతిచెందాడు. సోమవారం జర్నలిస్టులు నాగయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.1,24,300 నగదుతోపాటు రైస్‌మిల్లర్స్ సహకారంతో రెండు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు హమీద్, కలిమెల నాగయ్య, నరేందర్‌రెడ్డి, అస్లాం, అయూబ్, నాజీమొద్దిన్, అశోక్, వెంకన్న, శ్రీనివాస్, సైదులు, యాదగిరి, మట్టయ్య, రమేష్, బాలాజీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మిర్యాలగూడ వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న భాస్కర్

నల్లగొండ రూరల్ : మిర్యాలగూడ పట్టణానికి చెందిన కుర్రె భాస్కర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. ప్రిడిక్షన్ ఆఫ్ అండర్ 5 మోర్టాలిటీ రేట్స్ ఆఫ్ ఇండియా ఆ కంపారేటివ్ ఎనాలిసిస్ ఆఫ్ అరిమా అండ్ ఆర్టిఫిషల్ న్యూరల్ నెట్ వర్కు మోడల్స్ అనే అంశంపై ప్రొఫెసర్ రాఘవేందర్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆయన పరిశోధనలో వివిధ పత్రికల్లో ప్రచురితమైన భాస్కర్ ఆర్వీఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ రీసెర్చ్ సెంటర్‌లో స్టాటిస్టిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొపెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. డాక్టరేట్ ప్రదానంపై సహచర అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

గేయవర్షిణికి కళారత్న జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న గేయవర్షిణి

మిర్యాలగూడ : కళారత్న జాతీయ అవార్డు -2024 పట్టణానికి చెందిన సూక్ష్మ చేతిరాత కళాకారిణి గుంటూరు గేయవర్షిణి అందుకున్నారు. ఈ నెల 27న హైదరాబాద్‌లోని సుందరయ్య వి/్జాన కేంద్రంలో నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమి 8వ తెలంగాణ రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ గేయవర్షిణికి అవార్డును అందజేశారు. అవార్డు ప్రదానోత్సవంలో ఎంఎం.గౌతమ్, మౌనశ్రీమల్లిక్, ఎస్‌డీ.వెంకమ్మ, ఫణికుమార్‌లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన సచిన్

దేవరకొండ : మండలంలోని ముదిగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నేనావత్ సచిన్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికై నట్లు ఆ పాఠశాల పీడీ రంగానాయక్ తెలిపారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన వాలీబాల్ అండర్-14 విభాగంలో ఉమ్మడి జిల్లా జట్టు నుంచి ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. సోమవారం పాఠశాల హెచ్‌ఎం మాత్యనాయక్, పీడీ రంగానాయక్, పాఠశాల ఉపాధ్యాయులు సచిన్‌ను అభినందించారు.

బీసీ గర్జన విజయవంతం చేయాలి

మిర్యాలగూడ టౌన్ : పట్టణ కేంద్రంలో నవంబర్ 3న నిర్వహించే బీసీ గర్జనను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆయన వెంట రాజు, బీమారాజు, కృష్ణ, శరత్, లక్ష్మణ్ తదితరులున్నారు.

ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించొద్దు



ఆటో డ్రైవర్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

అడవిదేవులపల్లి : ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే వారికి జరిమానా విధించనున్నట్లు ఎస్‌ఐ శేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు జరిమానా విధించడంతో పాటు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సరదర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ఆటోల్లో ఎక్కించుకోని, అతివేగతంతో వాహనాలను నడిపితే వారికి జరిమానాతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట కానిస్టేబుళ్లు నాగుల్ మీరా, అంజి, విక్రమ్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర గిరిజన బాలికల గురుకుల విద్యాలయంలో టీజీటీ సైన్స్, ఫిజిక్స్ సైన్స్‌లో పార్ట్‌టైంగా ఆంగ్ల మాధ్యమంలో బోధించడానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కవిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు డిగ్రీలో 55శాతం, బీఈడీ 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి టెట్ అర్హత కలిగి ఉన్న మహిళ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 30 సాయంత్రంలోపు పాఠశాలలో అర్హత ధృవీకరణ పత్రాల జిరాక్స్‌లతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.